# విరిగిన మనసు

* రచన : కుమారి సత్యశారద *



సాయంకాలం మెరినా బీచ్ చాల సందడిగా ఉంది.

ఆ జన సమూహానికి దూరంగా తదేకంగా శూన్యం లోకి చూస్తు ఆలోచిస్తు కూర్చుంది సుశీల. చంద్ర 'బింబంలాం'టి ఆమె ముఖంలో విచార మేఘం అలుము కుంది. వెనుక నుండి 'సుశీ!' అని ఎవరో పిలిచినట్లయి వెను తిరిగి చూసింది. చిరునవ్వు నవ్వుచూ 'డాక్టర్ మోహన్' నిలబడి యున్నాడు. కంగారుగా లేచి 'డాక్టరు' అంది అంతవరకూ తన ముఖంలో ఉన్న విచారాన్ని దాచుకుంటూ. సుశీల నవ్వులో జీవంలేదని మోహన్‌కి తెలుసు. మోహన్ యిసుకపై రుమాలు పరచుకొని కూర్చున్నాడు. సుశీల గూడ ప్రక్కనే కూర్చొని దూరాన అలల వైపు చూడ సాగింది. తన అధికారితో ఏవిధంగా మాట్లాడాలో. అని సందిగ్ధిలోపడి మౌనంగా ఉండిపోయింది. వీరిద్దరి మధ్య కొన్ని నిముషాలు నిశ్శబ్దం రాజ్యమేలింది. సుశీల మోహన్ వైపు ఓరకంటితో చూసింది. రెప్ప వేయకుండా తనవైపు చూస్తున్న మోహన్‌ని చూసి సిగ్గుతో తలవంచుకుంది.

'సుశీలా!'........అంటూ మెల్లగా పిలిచాడు మోహన్.

'ఏం'...అన్నట్లు తలఎత్తి చూసింది సుశీల.

'నీ సేవతో రోగుల బాధలను మరిపించి వారి హృదయాల్లో అమృతం కురిపించిన నీ హృదయం లో 'హాలాహలం' దాచుకొని ఈ విధంగా నిలో నీవే కుమిలి పోవడం తగదు సుశీ?'

డాక్టరు మోహన్ తనపై చూపే ఆదరణకు పొంగి పోతూ మనస్సులోనే జోహార్లు అర్పించింది.

తన ప్రశ్నకు జవాబు రాకపోయే సరికి బాధతో కూడిన స్వరంతో 'నేను నీ జీవితంలో ప్రవేశిస్తున్నానని నీ విషయాల్లో జోక్యం కలిగించుకుంటున్నానని బాధ పడుతున్నావా? నీకు యిష్టం లేకపోతే నేనెన్నడూ నీ గురించి కలలోగూడ ఆలోచించను. వస్తా సుశీ! నీకు కష్టం కలిగించి ఉంటే నన్ను క్షమించు' అంటూ లేచాడు మోహన్. అంతవరకూ ఏదో ఆలోచిస్తున్న సుశీలకు మోహన్ లేపడంతో తేరుకొని—

'నన్ను క్షమించండి డాక్టరు. మీరు మీ చెల్లెలు 'శారద' నాపై కురిపించే ఆదరణ అభిమానాలకు నా హృదయం పొంగిపోయి మీకు ఏ విధంగా నా కృతజ్ఞతని తెలియజేయాలో తెలియక ఆలోచిస్తున్న నన్ను వేరే విధంగా అర్థం చేసుకోకండి' అంది సుశీల కన్నీరు కారుస్తూ.

'నీవు కన్నీరు కార్చడం నేను భరించలేను సుశీ? చూడు! నేనంటే నీ కిష్టమేనా?' అంటూ సుశీల మొఖాన్ని చేతితో పైకి ఎత్తాడు.

'నాకు భగవంతుడంటే ఎంత భక్తో - మీ రంటే నా కంత ప్రేమ డాక్టరు.'

మోహన్ ఈ మాటలకు ఉప్పొంగి పోయాడు. తను డాక్టరు పరీక్ష పాసయినప్పుడుగూడ యింత సంతోషం కలుగలేదు.

'చాల ధన్యుడ్ని సుశీ! నీ గురించి మా చెల్లి శారదను అడిగాను. 'నాకు తెలియదు నీవే అడుగు అన్నయ్యా' అని అంది. నా హృదయంలో ప్రేమ మూర్తిగా నిలచిన నీవు ఎల్లప్పుడూ విచారంగా ఉండడం సహించ లేక నీ బాధని పంచుకోవడం కోసం యింత చనువు తీసుకున్నాను. నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను సుశీ! నీ ప్రేమకు నేను తగిన వాణ్ని కాక పోతే ధైర్యంగా చెప్పు. నేను నీపై అధికారినని, నేనేమైనా అనుకుంటానని ఆలోచించకు.'

'నేనంత అదృష్టానికి తగను డాక్టరు. ఒక సంఘటనతో నా మనస్సు విరిగిపోయింది. యిక జీవితంలో ఏ పురుషుని నమ్మకూడదనే స్థితికి వచ్చాను. వివాహం చేసుకోకూడదన్న నిశ్చయంతో రోగుల పట శ్రద్ధాభక్తులతో నా విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తిసున్నాను.

'నీ గత జీవితం ఎలాంటిదైనా నీపై నాకు చాల పవిత్రమైన నమ్మకముంది సుశీ!'

'లేదు డాక్టరు నా చరిత్ర విని యిందులో నా దోషం ఎంత ఉందో మీరే నిర్ణయించాలి. అప్పుడుగాని నా మనస్సుకు శాంతి లేదు'

'చెప్పు సుశీ! వింటాను. నీ బాధ పంచుకోవడం కన్నా నాకు కావలసిన దేముంది.

సుశీల చెప్పడం మొదలు పెట్టింది......

♦ ♦ ♦

మాది విజయనగరం. నా చిన్నతనంలోనే తల్లిని కోల్పోయి పినతల్లి పెట్టే బాధలను సహిస్తు ఎస్. ఎస్. ఎల్.సి పాసయ్యాను. 'యింకా ఆడపిల్లకు చదువెందుకు? యిక చాలు' అని నా చదువుకి ఆనకట్టు వేసింది. మా ప్రక్కింటిలో 'క్రిష్టియను'ల కుటుంబం ఉంది వారికి ఒక అబ్బాయి ఒక అమ్మాయి సంతానం. అబ్బాయి విశాఖపట్టణంలో ఏ వి.ఎన్. కాలేజిలో బి.ఏ. చదువుతు శలవులకి యింటికి వచ్చాడు. అమ్మాయి నా ఈడుదే. పేరు 'మేరీ.' కాలక్షేపం కోసం వారింటి నుండి 'మేరీ'


మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు

MI

మీనాక్షి

పంపులు - మోటార్లు



♦

వ్యవసాయదారులకు నమ్మకముగా సేవచేస్తున్నది.

: తయారుచేయువారు :

**MEENAKSHI INDUSTRIES**
**SINGANALLUR : : COIMBATORE 5.**

SALES BRANCH :
**MEENAKSHI INDUSTRIES**
Hill St. : : RANIGANJ
**SECUNDARABAD (A. P.)**

Phone: 54 & 254 wite PBX Extensions    Estd. 1936    Grams: "CORONATION"

# THE CORONATION LITHO WORKS

DHARMAVILLA BUILDINGS, POST BOX No-2,
**SIVAKASI.**

*Wish you all our Deepavali Greetings*

Our 1970 picture calendars are ready for sale. Please order for your requirements through our agent or direct to us.

*Bombay Office:*
**204-A Khetwadi back Road**
**Bombay-4.**
Phone: 357737

*Madras Office:*
**"Thanjai Illam" Ist floor,**
**No-3, Sami Reddy St.,**
**Egmore, Madras-8.**
Phone: 87818.

ద్వార ఆంధ్ర ప్రభలు తెప్పించుకొని చదివి తిరిగి యిచ్చేస్తుండే దానిని. ఒకసారి ప్రభ తెరిచే సరిచి ఒక కాగితం క్రింద పడింది. తీసి చదివాను,

'ప్రియమైన సుశీల సన్నిధానమునకు !

మిమ్మల్ని చూసిన దగ్గరనుండీ నా హృదయం నా దగ్గర లేదు. మిమ్మల్ని ప్రతిరోజూ చూస్తూ పిచ్చివాణ్ణయి పోతున్నాను. నా మీద కరుణించి నా ప్రేమని స్వీకరించినట్లు జవాబు వ్రాసి తిరిగి యిదే పుస్తకంలో పెట్టి పంపించండి.

మీ ప్రేమను సదాకాంక్షించే ప్రియుడు
'జోసఫ్.'

నాకు పట్టలేనంత కోపం వచ్చింది. యింతలో ఎవరో వచ్చినట్లు అలికిడి అయి ఉత్తరాన్ని చింపి కిటికీలోంచి బయటికి పారేశాను. కిటికీ ఎదురుగా నవ్వుతూ జోసఫ్ నిలబడి యున్నాడు, ఛూ! అని ఉమ్మేశాను. ఆడపిల్లలతో ఈ విధంగా ఆటలాడ. వద్దని హెచ్చరిస్తూ ఒక జవాబు వ్రాశాను.

'మిస్టర్ !

పెండ్లికాని అమ్మాయిల జీవితాలతో ఈ విధంగా అటలాడి వారి జీవితాల్ని దాశనంచేయడం శ్రేయస్కరం కాదు. యికపైన యిటువంటి పిచ్చి వేషాలువేస్తే పెద్దల దాకా వెలుతుందీ విషయం.'

ఈ ఉత్తర్వాన్ని పుస్తకంలో పెట్టి పంపించి వేశాను. ఆ యువకుడు యింకా నావైపు చూస్తు చిరునవ్వు నవ్వుతున్నాడు. నాకు చాల అసహ్య మనిపించి గభాలున తలుపు మూసివేశాను. మరుచటి రోజు మళ్ళీ ఒక ఉత్తరత వ్రాసి పంపాడు. నా బలహీనతకు కని పెట్టాడు గాబోలు ఉత్తరం విస్సాను.

'సుశీల సన్నిధానమునకు !

మీ సువర్ణ హస్తాలతో వ్రాసిన ఉత్తరం చదివి చాల సంతోషించాను. ఆడవారికింత కోపం పట్టుదల ఉండడం మంచిది కాదు. నాపై ప్రేమ కురుపించండి.

సర్వదా మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి పూజించుకుంటాను. జవాబుకు ఎదురు చూస్తుంటూ.

మీ ప్రియ భర్తుడు
'జోసఫ్'

నాకు ఏమి చేయడానికి తోచలేదు. మా నాన్నకి తరచూ గుండెలో నొప్పి వస్తుండేది. మా పిన్నికి నేనంటే అసలే పడదు. వారికి చెప్పి అల్లరిపాలయ్యే కన్నా ఊరుకున్నంత ఉత్తమం లేదని యిక జవాబు వ్రాయకుండా యిక పుస్తకాలు తెప్పించకూడదని నిశ్చయించుకొని నా దగ్గరున్న మిగిలిన పుస్తకాలు పంపించివేశాను. యిక పుస్తకాలు తేవద్దని 'మేరీ'తో చెప్పాను. యిలా రెండు రోజులు గడిచాయి. మూడవ రోజు మా పిన్ని ఎదురింటి వారింట్లో ఏదో పేరంటం జరుగుతుంటే వెళ్లింది. మా నాన్న ఆఫీసు నుండి యింకా రాలేదు. యింతలో తలుపు చప్పుడయింది. మా నాన్నగారేమో నని లేచి వెళ్ళి తలుపు తీసి నిర్ఘాంతపోయాను. ఎదురుగా జోసఫ్ నిల్చొని.

'నాపై ఎందు కింత కోపం సుశీ! నిన్ను వివాహం చేసుకుంటాను. నన్ను నమ్ము' అంటూ నా చేతులు పట్టుకున్నాడు. నేను నిర్ఘాంతపడి తేరుకున్నంతలో ఎవరో వచ్చే అలికిడి అయే సరికి తిరిగిచూశాను. ఎదురుగా మా పిన్ని 'రుద్రకాళీ' రూపంతో ప్రత్యక్షమైంది.

'ఎంత తెగించావే. నీ వెంతో మంచిదానివనుకున్నాను, నీకు చదివించి నందులకు నీ విచ్చే శిక్షయిదా! ఎదురింటి వారు చెపితే ఏమో అనుకున్నాను. యిపుడు ప్రత్యక్షంగా యింటికే పిలిపించుకున్నావా? మీ నాన్న రానీ నీ సంగతి కనుక్కుంటా' అని ప్రక్కకు చూసింది. జోసఫ్ ఎప్పుడు జారుకున్నాడో.

రాత్రి భోజనాల దగ్గర నాన్నకి పిన్ని నా మీద ఏదో చెబుతుంది.

'ఈ సంగతి నాకు తెలిసినట్లు అమ్మాయికి తెలియనియ్యకు. తెలిస్తే యింకా భాద పడుతుంది' అని అంటున్నారు నాన్న. యింకా దగ్గరగా నిలబడి యింకేమిటంటూరా అవి రహస్యంగా వినసాగాను.

'రేపు ఒక సంబంద వస్తుంది. అబ్బాయి భాగా చదువుకున్నాడు. చాల ఆస్తిపరులు. అని అంటున్నారు నాన్న. నాన్న సహృదయానికి మనస్సులోనే నమస్కరించాను. మరుచటి రోజు సాయంకాలం ఒక యువకుడు ఒక ముసలతను కలసి నన్ను చూడడానికి వచ్చి నా పెపు అదోలా చూసి రెండు నిముషాలే కూర్చొని వెళ్లిపోయారు. రెండు రోజుల పోయిన తరువాత వారి వద్ద నుండి జవాబు వచ్చింది.

'మీ అమ్మాయికి ప్రక్కింటి అబ్బాయితో అక్రమ సంబంధ ముందని మాకు త్రోవలో ఒక అబ్బాయి చెప్పాడు. మీ సంబంధ మాకు అక్కర లేదు' అని.

పిన్ని నాన్న నన్ను చూసి 'చీ! పాతకీ యిపుడు మళ్ళీ ఏ మొఖం పెట్టుకొని సంబంధాలు చూడమంటావు? మా పరువు మంట గలిపావు. ఏ నుయ్యో గొయ్యో చూసుకో రాదూ? పీడ విరగడవుతుంది' అని నానా దుర్భాషలాడి గుండెనొప్పిరాగా ఆయాసంతో యింట్లో తన గదిలో కూలబడి పోయారు. ప్రక్కింటి యువకుని వల్లే కదా నాకు యిన్ని నిందలు వచ్చాయి అని కొంత సేపు నాలో నేనే ఏడ్చాను. పోనీ ఒక్కసారి వెళ్లి అతని పాదాల మీదపడి 'నన్ను ఈ విధంగా నలుగురిలో

*Wish you all our Deepavali Greetings.*

SRP
BANIANS

MARK OF SEAL
**Regd No: 244553**

**'MARUTHI' & 'ESSARPEE'**
**Products of Banians & Bra.**

: :

*Wanted Agents for Andhra State*
— PARTICULARS FROM —
**ESSARPEE KNITTINGS**
**10/25 Mohamadan St. TIRUPUR-4**

అనుమాన పర్చకు. నిన్ను ఈ విధంగా ఎందుకు చిత్రవధ చేస్తావు' అని బ్రతిమాలితే నా జోలికి రాకుండా ఉంటాడేమో అని ఆలోచించాను. యిదే మంచి ఆలోచనగా నా మనస్సుకి తోచి ఆ రోజు కాస్త చీకటిపడిన తరువాత మా పెరటి వైపు నున్న 'తులసి కోట' దగ్గర నిలబడి పూజచేస్తున్నట్లు నటించ సాగాను. యింతలో ఆ యువకుడు మధ్య గోడదూకి నా ఎదురుగా నిలబడి సంతోషంతో నవ్వుతున్నాడు. నేను తనకోసమే కాచుకొని ఉన్నానని అనుకున్నాడు గాబోలు. నేను అతని పాదాలు మీద పడి 'నన్ను యిక ఈ విధంగా అల్లరి పెట్టవద్దని' ఎన్నో విధాల అర్థించాను. యింతలో యింటిలో నుండి మా పిన్ని నాన్న వచ్చి నన్ను రెక్క పట్టుకొని బరబరా ఈడ్చుకొని పోయి గదిలో పెట్టి గొళ్ళెం పెట్టారు. చేయని నేరానికి శిక్ష ఏమిటో! అని ఎంతో ఏడ్చాను. నేను ఎన్ని విధాల నచ్చ జెప్పినా నా మాటలు నాన్న పిన్ని నమ్మలేదు. నేను చెడిపోయానని అసలే గుండె జబ్బున్న నాన్న మంచం పట్టి శాశ్వతంగా ఈ లోకం నుంచి వెళ్ళిపోయారు. పిన్ని నన్ను చూసి అసహ్యించుకునేది. తండ్రి మింగానని సవతి తల్లి పోరు ఆరంభమైంది. కట్టు బట్టలతో రైలెక్కి 'శారద' యింటికి వచ్చేశాను. 'శారద' నా చిన్ననాటి స్నేహితురాలు. నా చరిత్ర ఎవ్వరికీ చెప్పలేదు. నా వలనే మా నాన్న చనిపోయారు కదా అని నేను మరింత చెంగపెట్టుకొని గమ్యంలేని పడవలా ఉన్న నన్ను ఎన్నో ఆశలు కల్పించి సంతోష పెట్టడానికి ప్రయత్నించింది శారద, నా మనస్సు విరిగిపోయింది. యిక ఏ పురుషుడిని నమ్మరాదనే నిశ్చయానికి వచ్చాను. శారద ప్రోద్బలంవల్ల 'నర్సు' ట్రెయినింగ్ ఫాసై మీ డిస్పెన్సలో నర్సుగా చేరాను. యిది గతించిన నా జీవిత గాథ. విరిగిన మనస్సును మళ్లీ మీరు అతుకుతాననే సరికి నన్ను నేను విశ్వసించ లేకుండా ఉన్నాను. మీరే చెప్పండి. యిందులో నా తప్పుందా? అని ఉద్రేకంగా చెబుతూ క్షణం ఆగింది. అప్పటికి చాల చీకటి పడడం వలన బీచ్‌లో జనం పల్చబడ్డారు, తనగాథ విని మోహన్ అసహ్యించుకుంటున్నాడని ఊహించి తలెత్తి మోహన్ ముఖంలోకి చూసింది. మోహన్ కళ్లు ఆనందంతో మెరుస్తున్నాయి చీకట్లో నక్షత్రాల్లాగ. 'చెప్పండి డాక్టర్! నా తండ్రి మరణానికి నేనేగా కారకురాల్ని? నేను పతితనేగా?' ఉద్రేకంగా గట్టిగా అంది.

'లేదు సుశీ! యిందులో నీ తప్పేమీ లేదు. అంతా దైవ లీల. జరిగినదంతా ఒక పీడ కళగా భావించు. నీవు నిర్దోషివి. నా చెల్లెలు ప్రియ స్నేహితురాలిగా నిన్ను గౌరవిస్తూ జీవితాంతం ప్రేమిస్తాను. నన్ను నమ్ము సుశీ! నన్నుగూడ ఆ 'జోసఫ్' తో పోల్చుకుంటున్నావా?' అమాయకంగా అడిగాడు.

'లేదు డాక్టర్! నక్కెక్కడ నాగలోక మెక్కడ. మీరు నాకు పూజ్యులు. నన్ను దయతో ఆదరించిన శారదకు నాలో ఎండిపోయిన ఆశలను చిగురింప జేస్తున్న దేముడువంటి మీకు ఏ విధంగా నా కృతజ్ఞతలు తెలియజేయాలో అర్థం గావడం లేదు డాక్టర్'

'యింకా నన్ను 'డాక్టరు' అని సంభోదించకు సుశీ! ప్రేమతో ఒక్కసారి 'మోహన్' అని పిలు!' అన్నాడు మోహన్. సిగ్గు ముంచుకు రాగా 'మోహన్' అంటూ అతని వక్షస్థలం పైవాలి పోయింది. మోహన్ రెండు చేతులు సుశీల సన్నని నడుముని గట్టిగా పట్టుకున్నాయి.

యిదంతా గమనిస్తున్న చంద్రుడు సిగ్గుతో మేఘాల్లో దాగున్నాడు,

BRK TOWELS MDU

Our Hearty Diwali Greetings to All
Our Patrons and Well Wishers !!

Manufacturers &
Merchants
Of

B. R. KRISHNAIER & SONS
16, Mahal 4th Street,
MADURAI-I (S. I.)
Gram "BEYARKAY" Phone: 4375 & 3406

"MANOHAR" SAREES
MADE IN INDIA